## ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

బోథ్, జూన్ 15: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు వెంటనే అందించాలని ఏఐఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు మున్సిఫ్ శనివారం బోథ్‌లోని ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ సంవత్సరం ఉపాధ్యాయులు కొరత లేకుండా చూడాలన్నారు. బోథ్ మోడల్ స్కూల్‌లో అదనపు తరగతి గదులు నిర్మించాలన్నారు. ఇక్కడ నాయకుడు శ్రీకాంత్ ఉన్నారు.

## ఆవుల అక్రమ రవాణా, వధించినా కఠిన చర్యలు

ఇచ్చోడ, జూన్ 15 : బక్రీద్ పండుగను పురస్కరించుకొని హైకోర్టు ఆదేశానుసారం మండలంలోని గోవధను నిషేధించడం జరిగిందని మండల పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. మండలంలో కురేషిలు ఎవరు కూడా గోవులను వాహనాల్లో తరలించిన, గోవులను వధించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కురేషిలందరూ బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా సహకరించాలని కోరారు.

## మహిళ ల రక్షణే షీటీం ప్రధాన లక్ష్యం

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 15 : మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల, మరే ఏవిధమైన వేధింపుల వల్ల గాని ఇబ్బందులు ఎదుర్కొన్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని నిర్మల్ ఎస్పీ డా.జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీం, ఏహెచ్‌టీయూ పని చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని, కళాశాల, పాఠశాలల విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లకు గురైనా మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 8712659550 ఫోన్ నంబర్‌కు లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

## ఐరన్ మాత్రలు తీసుకోవాలి

నార్నూర్, జూన్ 15 : రక్తహీనత నిర్మూలనకు గర్భిణులు ఐరన్ మాత్రలు తీసుకోవాలని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. మండలంలోని బాబేఝరి, చిత్తగూడలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఐదేళ్ల పిల్లలకు టీకా వేశారు. అలాగే గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది హిమబిందు, ఈశ్వరి, విద్యారాణి, గోకుల్, అంగన్‌వాడీ టీచర్ నీలాబాయి, ఆశకార్యకర్త రమాదేవి పాల్గొన్నారు.

## బుక్‌స్టాల్‌పై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, జూన్ 15 : పాఠశాలల పాఠ్యపుస్తకాలు నోటుబుక్స్, స్కూల్ యూనిఫాం అమ్ముతున్న బుక్‌స్టాల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ సంఘం అధ్యక్షుడు సిడాం సాయికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ యూనిఫామ్స్ అమ్మకూడదని ఉత్తర్వులు జారీ చేసిన ప్రైవేట్ యాజమాన్యాలు పట్టించుకోకుండా అమ్ముతున్నారు. ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తు, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న చర్యలు తీసుకోవడం లేదన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు రవీందర్ రాజు, రవి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All

PLOT FOR SALE



★NH-63 ఆనుకొని ఉన్న రెసిడెన్షియల్ ప్లాట్ అమ్మబడును. ఆంధ్ర కాలనీ, పాత రైస్‌మిల్ ఎదురుగా, ఉత్కూర్, లక్సెట్టిపేట్ దగ్గర. ప్లాట్ ఏరియా: 10 గుంటలు. 9963557131.
NT-325816

REAL ESTATE

★హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, కోదాడ పరిసర ప్రాంతాలలో స్థలాలు, పొలాలు, ప్లాట్స్ అమ్మాలన్నా, కొనాలన్నా & డెవలప్ చేసి ఇవ్వాలన్నా సంప్ర: 9133915599, 7995912999.
NT-16-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

- నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్



మాట్లాడుతున్న నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్

సోన్, జూన్ 15 : వానలం ప్రారంభమైన దృష్ట్యా ఇంటి చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ అన్నారు. శనివారం నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలోని లెప్రా సోసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైలేరియా (బోధకాలు)పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటి చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, దీంతో క్యూలెక్స్ దోమ వల్ల బోధకాలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఇంటి చుట్టూ మురుగునీరు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ఫైలేరియాతో బాధపడుతున్న 8 మంది వ్యాధిగ్రస్తులకు లైట్‌వేట్ చెప్పులు, 16 మందికి దినచర్యలో ఉపయోగించుకునే కిట్‌ను వారికి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, పీవో ఎన్‌సీడీ డాక్టర్ శ్రీనివాస్, ముజ్గి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సౌమ్య, లెప్రా సోసైటీ ఫిజియోథెరపిస్టు కిసాన్‌రావు, డీపీఎంవో రాజేశ్వర్, సబ్‌యూనిట్ ఆఫీసర్ వేణురావు, పీహెచ్‌సీ ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండేళ్ల బాబుకు కిడ్నీలో రాళ్లు

- స్వప్న దవాఖానలో అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ చేస్తున్న డాక్టర్లు

నిర్మల్ అర్బన్, జూన్15 : సారంగాపూర్ మండలం ధని గ్రామానికి చెందిన దివ్యరాణి, రాజ్‌కుమార్ దంపతుల రెండేళ్ల కుమారుడు విహాన్ కొంత కాలంగా కిడ్నీ ప్రాంతంలో నొప్పితో బాధపడుతున్నాడు. పలు దవాఖానల్లో చూపించగా కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. తెలిసిన వారి సూచన మేరకు నిర్మల్‌లోని స్వప్న మల్టీ స్పెషాలిటీ దవాఖానకు తీసుకురాగా యూరాలజిస్ట్ మల్లేశ్, జనరల్ సర్జన్ నాలం శశికాంత్ పరిశీలించారు. తల్లిదండ్రుల ఒప్పందంతో అధునాతన పరికరాలతో శస్త్ర చికిత్స చేయగా విజయవంతమైంది. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా చికిత్స చేసినట్లు డాక్టర్ శశికాంత్ తెలిపారు. నిర్మల్, ఆదిలాబాద్ ప్రాంతాల ప్రజలు ఇలాంటి వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ద్విచక్రవాహనాలకు బహిరంగ వేలం

భైంసా, జూన్ 15 : పట్టణంలోని ఈ నెల 19వ తేదీన జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ద్విచక్రవాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నజీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 11 గంటలకు 50 శాతం ఈఎండీ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

## పుస్తక విక్రయ దుకాణాలు తనిఖీ

ఎదులాపురం, జూన్ 15 : పట్టణంలోని పలు బుక్‌స్టోర్‌ల్లో ప్రైవేట్ పుస్తక విక్రయ దుకాణాను విద్యాశాఖ పర్యవేక్షక అధికారి కందుల గజేందర్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోజువారీగా ఎన్ని పాఠ్యపుస్తకాలు విక్రయించారో వివరాలు ఇవ్వాలని యజమానులకు సూచించారు.

## ముథోల్ లైన్‌మన్ సస్పెన్షన్

ముథోల్, జూన్ 15 : ముథోల్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న అల్దార్‌ను సస్పెన్షన్ చేసినట్లు భైంసా డివిజన్ ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఒక రైతుకు మూడు బోర్లు ఉన్నప్పటికీ 12 బోర్లు ఉన్నట్లు తప్పుడు సర్వే చేసి విద్యుత్ శాఖకు రూ. 6 లక్షల 30 వేల నష్టం చేసినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు శాఖ పరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

## అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు



బోథ్: రిజిస్టర్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

బోథ్, జూన్ 15 : రైతులకు అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి డీ పుల్లయ్య హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లోని రిజిస్టర్లను, నిల్వ ఉన్న విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు విక్రయించిన తర్వాత రసీదు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. రైతు సంతకం, లాట్ నంబర్, విత్తనం వివరాలు, తేదీ అన్ని రాయాలన్నారు. తనిఖీలో ఏడీఏ శ్రీధర్ స్వామి, మండల వ్యవసాయాధికారి రమేశ్ కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.

ఇచ్చోడ, జూన్ 15 : మండల కేంద్రంలో విత్తనాల దుకాణాల్లో తహసీల్దార్ తుకారాం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతి లేని విత్తనాలు విక్రయించోద్దన్నారు. విత్తనాలు అమ్మిన తర్వాత రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామారావ్, విత్తన డీలర్ పాల్గొన్నారు.



ఇచ్చోడ: రిజిస్టర్ పరిశీలిస్తున్న తహసీల్దార్ తుకారాం

# ప్రజల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తాం



కొబ్బయిగూడలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

ఇంద్రవెల్లి, జూన్ 15: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం మండలంలో గోండ్‌గూడ, మిలింద్‌నగర్, బుద్ధనగర్, భీంనగర్, ప్రభుద్ధనగర్, గజానంద్‌నగర్, బజార్‌గల్లీ, రాంనగర్, వడ్డెర కాలనీలోని, పూలాజీబాబా నగర్, కొబ్బయిగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో పేదలను గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు సోమోరే నాగోరావ్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సోన్‌కాంబ్లే జితేందర్, మాజీ సర్పంచ్‌లు మెస్రం నాగ్‌నాథ్, సుంకట్‌రావ్, నాయకులు యాకుబ్‌బేగ్, తులసీరాం, సోయం రాందాస్, మారుతి పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నర్సాపూర్(జీ), జూన్ 15: మండలంలోని పాత బూర్గుపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని శవాన్ని శనివారం రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్‌చాంద గ్రామానికి చెందిన బూర్ల నర్సయ్య(55) మన్మద్ గ్రామంలో నాలుగు రోజుల నుంచి తాపిమేస్త్రి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను మద్యం మత్తులో తిమ్మాపూర్‌లో ఉంటున్న తన కూతురు ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కిందపడి మరణించి ఉండవచ్చు లేదా శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం,ఉరుములతో ఏదైనా ప్రమాదం జరిగి మరణించాడా అని అనుమానంతో తగు చర్యల నిమిత్తం అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ హన్మాండ్లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

పెంబి, జూన్ 15 : ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని రాష్ట్ర హార్టికల్చర్ మాజీ కమిషనర్ వెంకట్రామి రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పాకాల రాంచందర్ సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను ఉద్యానవన శాఖ మండల అధికారి మౌనికతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రెండు లక్షల ఎకరాల్లో 50 మంది రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఒక ఎకరం వరి సాగుకు అందించే నీటితో నాలుగు ఎకరాల్లో ఆయిల్ పామ్‌ను సాగు చేయవచ్చని తెలిపారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

భైంసా, జూన్ 15 : అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, పాఠశాల యూనిఫాంలను అక్రమంగా విక్రయిస్తున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ గంగాప్రసాద్, ఏబీవీపీ నాయకులు ఉన్నారు.

## డబుల్ బెడ్రూం ఇండ్లకు తాళాలు

కడెం, జూన్ 15 : కడెంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన రెండు పడక గదుల ఇండ్లను పలువురు స్థానికులు ఇటీవల కబ్జా చేసి ఇండ్లలోకి చొరబడగా వారం రోజుల అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం కడెం తహసీల్దార్ సుజాతరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ అధికారులు వారిని శనివారం ఖాళీ చేయించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ఇండ్లలో కడెం, పెద్దూర్, పెద్దూర్‌తండా గ్రామానికి చెందిన పలువురు ఆక్రయించుకోవడంతో అధికారులు శనివారం ఖాళీ చేయించారు. గతంలో కలెక్టర్ ఆధ్వర్యంలో రెండు సార్లు గ్రామసభలు నిర్వహించి, అర్హత గల పేదలకు ఇండ్లను కేటాయించగా, ఎన్నికల కోడ్ ఉండడంతో పంపిణీ విషయంలో జాప్యం జరిగింది. ఈ విషయమై ఇటీవల స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సైతం చొరబడిన వారిని ఖాళీ చేయాలని ఆదేశించారు. అయితే శనివారం తహసీల్దార్ సుజాతరెడ్డి పోలీసుల ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ సిబ్బందితో కలిసి ఖాళీ చేయించి, 200 ఇండ్లకు తాళాలు వేసి సీజ్ చేశారు. తమకు సమాచారం లేకుండా ఎవరైన అక్రమంగా చొరబాటుకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ కమలాకర్, ఏఈ లవకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించండి



కిందపడిన విద్యుత్ తీగలు

కుంటాల, జూన్ 15 : మండలంలోని ఓలా గ్రామంలో గత నెలలో కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నెలకొరగగా తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ సిబ్బంది అప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. అయితే 1వ వార్డులోని కాలనీలో కూడా అదే రోజు విద్యుత్ తీగలు తెగిపడి కొన్ని గృహాలకు, వీధి దీపాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అదే వీధిలోనున్న ఓ సెల్‌ఫోన్ టవర్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తాత్కాలిక విద్యుత్ సరఫరా ఇచ్చారు. తాత్కాలికంగా గృహాలకు ఇచ్చినా, వీధి దీపాలకు సరఫరా లేకపోవడంతో రోడ్డు వెంబడి వెళ్లినప్పుడు చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని త్వరగా మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

గుడిహత్నూర్, జూన్ 15 : పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. గుడిహత్నూర్‌లోని పోలీస్ స్టేషన్‌లో శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలన్నారు. పశువులను అక్రమంగా వాహనాల్లో తరలిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్, వివిధ గ్రామాల శాంతి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈఎంటీ లక్ష్మణ్‌కు సన్మానం



ఈఎంటీ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్

భైంసా, జూన్ 15: గుండెపోటు వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఒక బాధితుడికి సీపీఆర్ చేసి ప్రాణం పోసి ఆర్థికంగా కొంత డబ్బును పోగు చేసి సహాయపడినందుకు ఈఎంటీ లక్ష్మణ్ పూజారికి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డు వచ్చినందుకు మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్, డా. విజయానంద్ శనివారం ఆయన నివాసంలో పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట నాయకులు, తదితరులు ఉన్నారు.

## పెంబి తైబజార్ వేలం రూ.1.20 లక్షలు

పెంబి, జూన్ 15 : మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నర్వహించే వారసంతకు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన అబ్జల్‌ఖాన్ వేలంలో పాల్గొని రూ.1.20 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి అంకురార్పణ

ఖానాపూర్ టౌన్, జూన్ 15 : ఖానాపూర్‌లోని శాంతినగర్ కాలనీలో గల పురాతన హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి శనివారం అంకురార్పణ చేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ఎలాంటి దోషాలు లేకుండా వేదపండితులు విష్ణుబట్ల రాజశేఖర శర్మ, వెంకటేశ్, ఆలయ అర్చకుడు నాగరాజు అధ్వర్యంలో విశేషమైన అభిషేక, అర్చన కార్యక్రమాలు నిర్వహిం చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అంకం రాజేందర్, అలయ కమిటీ అధ్యక్షుడు కొండాడి నాగేందర్, బీసీ రాజన్న, అశోక్ రావు, కతులపురం గంగనర్సయ్య, నాగరాజు, వేణు, శేఖర్, రంజిత్‌రావు, రవి పాల్గొన్నారు.

## పాముకాటుతో వివాహిత మృతి

భీంపూర్, జూన్ 15 : భీంపూర్ మండలం కైరిగూడ గ్రామానికి చెందిన వివాహిత పెందూర్ లక్ష్మి (30) శుక్రవారం చేను పనికి వెళ్తామని మరో మహిళ ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో అక్కడ ఆమె కాలుకు పాము కాటు వేసింది. రిమ్స్‌కు తరలించే క్రమంలో శుక్రవారం రాత్రి మార్గమధ్యంలోనే మృతి చెందింది. శనివారం కైరిగూడలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె భర్త రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇప్పుడు తల్లి కూడా అకాల మృత్యువాత పడడంతో పిల్లల పరిస్థితి దయనీయంగా మారింది. ఆమె కూతురు నవ్యశ్రీ 7వ తరగతి , కుమారుడు రిషిక్ 4వ తరగతి అమ్మమ్మ గ్రామంలోనే ఉంటూ చదువుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీంపూర్ పోలీసులు తెలిపారు.

## రోగులకు పండ్లు పంపిణీ

నర్సాపూర్(జీ), జూన్ 15: మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ దవాఖానలో ఉపముఖ్య మంత్రి మల్లు బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర హస్తకళ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సమత ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సమత సుదర్శన్, దవాఖాన సూపరింటెండెంట్ దేవేందర్ రెడ్డి, కుంటాల జడ్పీటీసీ గంగామణి బుచ్చన్న, నర్సాపూర్ జడ్పీటీసీ చిన్న రామయ్య, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, పాపెన్ రాజేశ్వర్, గంగారాం, ఉమ్మడి జిల్లా బీసీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పోశెట్టి, అమరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సంపు పరిశీలన



సంపును పరిశీలిస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూన్ 15 : ఆదిలాబాద్ రూరల్ ప్రాంతంలో తాగునీటి ఇబ్బందులను దూరం చేస్తూ కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టి తాగునీటి సౌకర్యాన్ని కల్పించిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పలధరి, దాహిగూడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. దాహిగూడలో కేసీఆర్ ప్రభుత్వం కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసి మిషన్ భగీరథ సంపు కేంద్రాన్ని పరిశీలించారు. సంపులోకి నీరు చేరకపోవడంతో గ్రామంలో నీటి కొరత ఏర్పడుతుందని పేర్కొన్నారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందిపై త్వరలో పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. అయన వెంట ఎంపీపీ గండ్రత్ రమేశ్, ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కుమ్రరాజు ఉన్నారు.

## గిరిజన లంబాడీలపై పెరిగిన అత్యాచారాలు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్

నేరడిగొండ, జూన్ 15 : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గిరిజన లంబాడీలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని గిరిజన లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ ఆరోపించారు. శనివారం నేరడిగొండలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొన్న ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో, నిన్న హైదరాబాద్ మియాపూర్‌లో ఇలా చెప్పుకుంటూ పోతే రోజురోజుకు గిరిజన లంబాడీలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలపై జరుగుతున్న అత్యాచార ఘటనలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలకు ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించాలని అన్నారు. లేని పక్షంలో లంబాడీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో లంబాడీల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ , ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద, జూన్ 15: విద్యార్థులు చదువులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశించిన విధంగా ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం బాబాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నగేశ్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న జనగాం ఐఏఎస్ మాజీ అధికారి సీహెచ్ శివలింగయ్య

కుంటాల, జూన్ 15 : ఓలా గ్రామంలో మాజీమంత్రి వ్యక్తిగత సహాయకుడు నాలం శ్రీనివాస్ తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను శనివారం జనగామ జిల్లా మాజీ కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య పరామర్శించారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి

ముథోల్, జూన్ 15 : కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని పార్టీ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి అన్నారు. శనివారం వెంకటాపూర్ గ్రామంలో మంత్రి సీతక్క ఎస్డీ, ఎఫ్‌సీ నిధులతో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బోరు మోటరు వేయించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ ఆధ్వర్యంలో బోరు మోటర్ వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయినాథ్, నాయకులు మహేశ్, సాయినాథ్, పోశెట్టి, ముత్యం, తోట బోజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైకుంఠధామంలో నీటి సౌకర్యం

భీంపూర్, జూన్ 15 : భీంపూర్ మండలం కైరిగూడ గ్రామ వైకుంఠధామంలో శనివారం బోరు వేయించారు. కార్యదర్శి సూర్యకాంత్ పనులు పర్యవేక్షించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థికి సన్మానం

భైంసాటౌన్, జూన్ 15 : మాటేగాం జడ్పీ స్కూల్‌లో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి ఎం తరుణ్ టీఎస్ఆర్‌జేసీ బెల్లంపల్లి కళాశాలలో ఇంటర్ చదవడానికి ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీవీ రమణ రావు, ఉపాధ్యాయులు మహిపాల్ రెడ్డి, రమేశ్ రెడ్డి, రమేశ్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ లింకేజీలో ద్వితీయస్థానం

సోన్, జూన్ 15: ఇందిరాక్రాంతి పథకంలో భాగంగా బ్యాంకింగ్ లింకేజీలో 2023–24 సంవత్సరానికి గాను నిర్మల్ జిల్లా ద్వితీయస్థానం నిలిచింది. శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి శిక్షణ సంస్థలోని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. నిర్మల్ జిల్లా బ్యాంకింగ్ లింకేజీలో రూ. 403కోట్ల లక్ష్యం కాగా లక్ష్యానికి మించి రూ. 411 కోట్లతో జిల్లా రెండో స్థానం సాధించుకుంది. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా డీఆర్‌డీఏ విజయలక్ష్మి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే జ్ఞానులు అవార్డును అందుకున్నారు. అదే విధంగా మహిళా సంఘాలకు రుణాలు అందించిన తర్వాత తిరిగి బ్యాంకులకు చెల్లించడంతో మొండి బకాయి రాష్ట్రంలోనే (ఎన్‌పీఏ 0.18శాతం) ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమైక్య మేనేజర్ డీ శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి గంగామణి, కార్యదర్శి ముస్కు సునీత పాల్గొన్నారు.